# విశ్వనాథ సత్యనారాయణ తో



విశ్వనాథ సత్యనారాయణ గారు మధురవాణితో పేకాడుతూ వుంటారు. సత్యనారాయణ గారు వక్కపొడి నములుతూ 'థూ థూ' అని తూస్కారాలు చేస్తూ మెడరిక్కించి యిటు అటూ చూస్తూ 'సెట్' చేయడంలో నిమగ్నమై వుంటారు సత్యనారాయణ గారు ముక్క వేస్తారు. మధురవాణి ముక్క తీసి-

**మధురవాణి:** షో -

**విశ్వనాథ:** కొంప ముంచావే - నాలుగు సెట్లు అయాయి. ఈ వెధవ ఆసు చూడు, రామ్ రామ్.

**మధుర:** యీ పేకాటకీ రామాయణానికీ ఎలా కుదురుతుంది?

**విశ్వ:** మరల నిదేల రామాయణం బన్నచో -

**మధుర:** తెలుసులెండి 'తినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్ళు' అంటారు అన్నం తినడం రామాయణం రాయడం ఒకటేనా?

**విశ్వ:** ఎవడిష్టం వాడిది థూ .

**మధుర:** నేనన్నదదికాదు వాల్మీకి రామాయణం అర్థంగాకపోతే తప్పువాల్మీకిది కాదు

**విశ్వ:** కాదు-

**మధుర:** మరి రామాయణ కల్పవృక్షం అర్థం గాకపోతే తప్పంతా సత్యనారాయణ గారిదైనట్లు మాట్లాడుతారే?

**విశ్వ:** అల్లా గడ్డి పెట్టు, అడిగే వాళ్ళకి ఈ జన సమూహమున యందు నే శరీర మాత్రముగ బోవు చుంటి; నా మానసంబు సమిత తృష్ణాలసంబంత కంత భూమి మీదనుండి స్వర్గానికి మెట్ల కట్టు

**మధుర:** పేకాడుతూన్నప్పుడు కూడానా-

**విశ్వ:** నా (పాడు) మనసుకి విశ్రాంతి యేది? కాసేపు ఆ మనసును పట్టించుకోకుండా వుందామని చీట్లపేక ఆడుతూ కూర్చుంటా అప్పుడూ ఆగదు యీ మనస్సు

**మధుర:** ఏం చేస్తుంది?

**విశ్వ :** మనకు తిధులున్నాయి కదా! ప్రతి తిథిలోనూ చంద్రుడెప్పుడు ఉదయిస్తాడు, ఎప్పుడస్తమిస్తాడు; ఏ దిశనుండి వెన్నెలలు ఎలా పడతాయి; చీకట్లు ఎలా కమ్ముతాయి, యిలా ఆలోచిస్తూ నేను ఎన్ని రాత్రులు నిద్ర లేకుండా ఆకాశం వైపు చూస్తూ గడిపానో

**మధుర:** మిమ్మల్ని విమర్శించే వాళ్ళు మిమ్మల్ని చదవకుండా విమర్శిస్తున్నారనుకుంటా

**విశ్వ:** వాడికి మనస్సనేదే వుంటే, చదవటమనేది తెలిస్తే; నా రామాయణం చదివిన వాడు, లోకాన్ని నేను ఎంత నిశితంగా అనుశీలించానో తెలుసుకుంటాడు! కాలంలోని ప్రతి లిప్తనేను చూచాను. దేశంలోని ప్రత్యంగుళం నేను కొలిచాను.

**మధుర:** అన్నట్లు అడవిలో సీతారాములు గడిపిన మొదటి రాత్రి గురించి రాశారు మీరెప్పుడైనా అడవుల్లోవున్నారా?

**విశ్వ:** వ్రాయాలంటే అడవిలో కాపురం వుండనక్కర్లేదు. భావించగల మనస్సుండాలి. అది నిత్య జాగ్రదవస్థలో వుంటుంది

**మధుర:** అంటే రైలులో వెళ్ళినా కారులో వస్తున్నా కూడానా?

**విశ్వ:** ఆహ్హా! దీనికి తోడు అడవిలో తిరిగా. వేటను గురించి జిమ్‌కార్బెట్, హెండర్‌సన్, సింగ్ వీళ్ళందరివీ చదివా-

**మధుర:** జిమ్ కార్బెట్ చదివి సీతారాములు అడవిలో గడిపిన మొదటి రాత్రి వ్రాశానంటారా? (నవ్వు)

**విశ్వ:** ఇవన్నీ నాకేమి ఒరిగించాయి. వాటిలోని విషయాలు నా మనసులో పడిన తరువాత వాటికి కలిగే సంస్కారం వేరు అవి నా అనుభవ విషయాలవుతాయి

**మధుర:** చిత్రంగా వుందే-

**విశ్వ:** ఏనాడో ఎక్కడో నేను అలా అడవిలో రాత్రిళ్ళు గడపివున్నాననే అనిపిస్తుంది.

**మధుర:** ఏది మీ చెయ్యి యిలాగివ్వండి. చూస్తా-

**విశ్వ:** సరే నా చెయ్యిస్తే నాకేమిస్తావ్?

**మధుర:** ఓ ముద్దు! సరేనా?

**విశ్వ:** నాకు భారత ప్రభుత్వం వారిచ్చిన పద్మభూషణ కంటె ఎక్కువే ఇదిగో చూడు

**మధుర:** రేఖలు ఎర్రగా వుండి మృదువుగా వుంది మా హస్తం (ముద్దు పెట్టుకుంటుంది)

**విశ్వ:** చేతినా ?

**మధుర:** శిరోరేఖ అరచేతి మధ్యలో వాలి, చంద్రస్థానానికి చేరి, రెండుగా చీలితే-

**విశ్వ:** చీలితే-?

**మధుర:** అసాధారణమైన యోచనా, సృజనాత్మక శక్తి కలిగి వుండటాన్ని సూచిస్తుంది. చిటికిన వ్రేలు పొడుగ్గా వుంటే సాహిత్యంలో ప్రతిభను చాటుతుంది

**విశ్వ:** యింకా-!

**మధుర:** బొటనవ్రేలు స్ట్రెయిట్ రెండవ కణువు స్టిఫ్‌గా వుండి, గోళ్ళు ఎరుపుగా, పొడవుగా, వెడల్పుగా వుండి, ప్రతి గోరు చంద్రవంకలు కల్గివుంది

**విశ్వ:** యింతకీ ఏమంటావు?

**మధుర:** సాహిత్య రంగంలో తగిన మీ మానస శక్తిని శిరోరేఖ చూపిస్తోంది. దీక్ష, కృషి చేయడానికి కావలసిన శక్తి, ఓపిక; మీ హృదయ శిరోరేఖల మధ్య దీర్ఘచతురస్రాకారంగా ఏర్పడిన ఆకారం యిందుకు కారణం.

**విశ్వ:** నువ్వు చెప్పింది నేనెట్లా నమ్మేది?

**మధుర:** జార్జిబెర్నార్డ్‌షా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్క్ ట్వైన్ గార్ల జాతకాల్లాగ మీ జాతకం వుండబట్టే నేను చెప్పగలిగా.

**విశ్వ:** అబ్బో, చాలా ఘటికురాలివే! చెప్పు-

**మధుర:** మీచేతి వేళ్ళు కణుపులుగా వుండటం (నాటీ జయింట్స్) మంచి విమర్శనాశక్తికి నిదర్శనం వేళ్ళు పొడవుగా విడి విడిగా వుంటే స్వాతంత్ర్య భావము, ఆత్మ విశ్వాసం ఎక్కువగా వుంటాయి

**విశ్వ:** వున్నదే అది నువ్వు నాకు జోస్యం చెప్పినందుకు నీకు నేనో రహస్యం చెబుతా విను మనకు తెలిసిన మాటలనే, మనం పలికే పదాలనే వుపయోగించి ఒకానొక విన్యాస విశేషం చేత కవి జగాలనే సమ్మోహింప జేస్తాడు

**మధుర:** అయితే వున్నదంతా కవి విన్యాస మహిమలో వుందంటారు?

**విశ్వ:** నన్నయ్యయు దిక్కన్నయు నన్నావేశించిరి, పరిణాహమనస్సం చన్నత వారలు పోయిన తెన్నున మెఱుగులను తీర్చి దిద్దుచు బోదున్!

**మధుర:** మీ ఫేట్ లైన్ చంద్రస్థానం నుండి బయల్దేరి సూర్య స్థానానికి చేరిందంటే అర్థం మీకు జ్ఞానపీఠం బహుమతి వచ్చి వుంటుంది అవునా?

**విశ్వ:** నీవు పేపర్లో చదివి చెబుతున్నావు, లేదనేందుకునేనెవణ్ని?

**మధుర:** ఏదైతే నేమిటి? భూమి గుండ్రంగా వుండి తన చుట్టు తాను తిరుగుతోందని జాగ్రఫీ పుస్తకాల్లో స్పష్టంగా వుంటే, మీరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వేయి పడగలున్నాయనీ ఆ పడగల మీద భూమిని మోస్తున్నాడని నమ్ముతున్నా రేవిటి?

**విశ్వ:** భూమిని సుబ్రహ్మణ్యేశ్వరుడు మోస్తున్నాడన్నది పౌరాణికమైన మాటకాని భూగోళ విషయం కాదు

**మధుర:** అంటే జాగ్రఫీ వేరు పురాణాలు వేరూనా?

**విశ్వ:** అవును ధర్మం సహస్ర ముఖంగా వుంటుంది; ధర్మం చేత భూమి పాలింపబడుతూ వుంటుంది అని అర్థం. అదే వేయి పడగలు

**మధుర:** మీ నవల్లో రామేశ్వరశాస్త్రి నాలుగు వివాహాలు చేసుకున్నాడు బ్రాహ్మణులు అన్ని పెళ్ళిళ్ళు చేసుకోవచ్చని చెప్పడంలో మీ వుద్దేశం?

**విశ్వ:** అది సాంకేతికమైన విషయం యథార్థం కాదు.

**విశ్వనాథ సత్యనారాయణ**

**మధుర:** సుబ్బన్నపేటలో పాములు ఎక్కువా?

**విశ్వ:** సుబ్బన్నపేట సుబ్బన్నపేట కాదు. అది దేశానికంతా చిహ్నం. పాములంటూ అవి పాములు కావు. గ్రామాధికారి నాలుగు పడగల పామును చూస్తాడు. అది చాతుర్వర్ణ ధర్మం. అరుంధతికి రెండు పడగలు కనిపిస్తాయి, అదీ దాంపత్య దర్మము చివరికి ఒక పడగే కనిపిస్తుంది. అది అంతా కలిసి ఏక రూపమైన ధర్మము.

**మధుర:** మీరు జమీందారీ విధానాన్ని సమర్థించారని దాని అర్థం; అవునా?

**విశ్వ:** ఇక్కడి జమీందారు రాజస్థానీయుడు రాజనగా ఒకే వ్యక్తి రాజు కాదు. దేశాన్ని పాలించే వాళ్ళంతా కలిసి ఒక రాజు. ఇక్కడ జమీందారంటే పాలకవర్గం అని అర్థం.

**మధుర:** మీరు రాసింది అడిగితే మీరే కాదంటున్నారు మీతో ఎల్లావేగడం? మరి జమీందారు కొడుకు రంగారావు మాటేమిటి'

**విశ్వ:** విజాతీయమైన భావానికి లొంగిపోయి సంప్రదాయమూ స్వజాతి లక్షణమూ మర్చిపోయిన వాడు రంగారావు

**మధుర:** మరి గుర్రప్పందాల గురించి వ్రాశారు-?

**విశ్వ:** గుర్రప్పందాలంటే గుర్రాలు, పందాలు కావు, విజాతీయ సంస్కృతి వ్యామోహానికిది చిహ్నం

**మధుర:** సుబ్బన్న పేటకి ఎలక్ట్రిసిటీ వస్తే విద్యుద్దీపాలని తిట్టారు మీరు?

**విశ్వ:** దీపాలంటే విద్యుద్దీపాలని తిట్టానా? అనాది నుంచీ యీ దేశం గ్రామ నాగరికత కలది లక్షలాది పల్లెటూళ్ళు - ప్రధాన వృత్తి వ్యవసాయము కల యీ దేశం పరిశ్రమలు కల దేశాల నాగరికత నవలంబించి చెడిపోతున్నదని తాత్పర్యం

**మధుర:** పంపులు వస్తే వీథుల్లో పంపుల్ని తిట్టారు. మీరు మీ యింట్లో విద్యుద్దీపాలు వాడటం లేదా? పంపుల్లోంచి నీళ్ళు వస్తే తాగటం లేదా?

**విశ్వ:** నేను వేయిపడగలు రాసేనాటికి పట్టణ నాగరకత వచ్చి ఎల్లా గ్రామాలు పాడవుతున్నాయో చెప్పాను. పంపుల్నీ దీపాల్నీ తిట్టానా? అవన్నీ సాంకేతికమైన విషయాలు

**మధుర:** మొత్తానికి మీరు మార్పులకి వ్యతిరేకి మీదంతా వెనకచూపే కాని ముందుకు చూడలేరు.

**విశ్వ:** పిచ్చి పిల్లా. నీకు విశ్వనాథ అర్థం కావాలంటే, వాని సనాతన ఉపదేశాలని కొట్టి పారెయ్యకుండా వుండాలంటే; సాహిత్యం సంస్కృతి అవిభాజ్యం అనీ వాటి ఉద్ధరణ కూడా అవసరం అనీ గ్రహించాలి.

**మధుర:** మీకసి అంతా ఎవరి మీద?

**విశ్వ:** అంటే పాలకవర్గం, ధనికులు సంప్రదాయాన్ని, దేశీయ పాండిత్యాన్ని, దేశీయ సంస్కారాన్ని నిరాదరిస్తున్నారని నా తాత్పర్యం.

**మధుర:** సుబ్బన్నపేట గురించి చెప్పడానికి ముందు ఒక ఆవు-పాము, ఆపాము ఆవుపాలు తాగుతూ వుండటం చెప్పారు. ఆ కథ ఎందుకు?

**విశ్వనాథ :** అది యీదేశం యొక్క స్వరూపం చెప్పటానికి అలా వ్రాశాను. ఏమిటయ్యా యీ దేశం యొక్క స్వరూపం. అంటే యీ దేశం యొక్క సంస్కారం యొక్క పునాది అది. ఆధిదైవికము అన్న విషయం. అంతే గాని, యిది నిజంగా పామూ కాదు, పాము పడగలూ కాదు.

**మధుర:** అయితే వేయి పడగల్లో నిజానికి పడగలూ లేవు, పామూ లేదు బలే చమత్కారంగా వుందే.

**విశ్వ:** నిజమే. ఉన్నది ధర్మము, సంప్రదాయము, భారతజాతి యొక్క సంస్కారము. ఈ గ్రంథంలో ప్రధానంగా సహస్ర ముఖమైన వేద ధర్మం ప్రతిపాదింపబడింది ఇది తెలుసుకుంటే సరి, అంతాఅర్థం అవుతుంది నీకు.

**మధుర:** మరీ మీ నవలలో పసిరిక అనే పాత్రను ఎలా సృష్టించారు? అలాంటి పాత్ర వుంటుందా?

**విశ్వ:** పసిరిక మంగమ్మ బిడ్డ, చూస్తే పాముల్లే వుంటాడు. ఈలలు వేస్తాడు గాలిలో తేలి పోతాడు రామేశ్వరశాస్త్రి చాతుర్యర్ణ్యానికి చిహ్నం అయితే పసిరిక వ్యవసాయానికి చిహ్నం కదా! అలాంటి వాడు వుండవచ్చు - వుంటే

**మధుర:** మీరు సృష్టించారన్న మాట.

**విశ్వ:** ఆశ్చర్యం లేదు. కాని, ప్రధానంగా పసిరిక కృషికి చిహ్నం అది అచ్చమైన పంచభూతముల బహిఃప్రకృతి మీద ఆధారపడివుంది

**మధుర:** అంటే?

**విశ్వ:** వానకు నానాలి. గాలి వీచాలి. ఎండలు కాయాలి పంటలు పండాలి పాములూ, పిట్టలూ యథేచ్ఛగా సంచరించాలి. ఇది వ్యవసాయం యొక్క స్వరూపం ఇదంతా ఒక మనుష్యుని ఆకారంగా చేసి వాణ్ని పసిరిక అన్నాం ఇంతే భేదం.

**మధుర:** మరి వాణ్ని పాములెందుకు కరిచాయి పాపం

**విశ్వ:** విను చెప్తా. వ్యవసాయం రెండు రకాలు పొలం వాన ఆధారంతో పండితే దాన్ని దేవమాతృక అంటారు. ఆనకట్టలు కట్టి కాల్వలు తవ్వి పండిస్తే వాటిని అదేవమాతృకలంటారు. పల్లపుటూళ్ళ పంటలు వాళ్ళు బోలెడంత విశ్రాంతి కల వాళ్ళు. తేలికగా పండుతూ వుంటే బోలెడంత విశ్రాంతి.ఎవరికి విశ్రాంతి వుంటే ధర్మాన్ని వాళ్ళు పాడుచేస్తారు.

**మధుర:** చిత్రం చిత్రం, మహాచిత్రం గా వున్నాయి మీ మాటలు.

**విశ్వ:** మూడు వందల అర్వై రోజులు పొలంలో పాటుపడవలసిన వారు రాజకీయ, మత, సాంఘికాభిప్రాయాల మీదకు దండెత్తేందుకు పాపం వారికి విశ్రాంతి యేది?

**మధుర:** కష్టపడేవాడ్ని నిద్రలేపడం ప్రమాదం అంటారు.

**విశ్వ:** అంతే. అటువంటప్పుడు ధర్మం అజ్ఞులచేత పాలింపబడవలసి వస్తుంది. అందుకే పసిరిక గ్రామాధికారి చేతినున్న గడియారం, పౌంటెన్ పెన్, చొక్కా మొదలైనవి పెట్టుకొని వెళ్ళేసరికి పాములతణ్ణే కరచినవి.

**మధుర:** పాపం;....

**విశ్వ:** ఈ రెండు నాగరికతలు అంత భిన్నములు. రెండూ రెండుగా రక్షింపబడితేనే ధర్మం రక్షింపబడుతుంది.

**మధుర:** నిజమే - మన మతం కూడా క్షీణదశకు రాలేదా?

**విశ్వ:** అన్ని సిద్ధాంతాలు మొట్టమొదట మంచివే. మనుష్యుల కామక్రోధాదుల చేత కాలముమీద వాటి లక్షణాలు చెడతవి ఎంత కొత్త సిద్ధాంతమైనా అంతే. ప్రజాస్వామికము మంచిదే. ఆచరణలో యెంత దోష భూయిష్ఠంగా వుంది? అట్లాగే హిందూ ధర్మమున్నూ

**మధుర:** దీనికంతా కారణం ఎవరు?

**విశ్వ:** మనిషే. వాడికి అధికార వాంఛ, స్వార్థం పుట్టుకతో వున్నాయి వాడు సర్వధర్మాన్నీ నాశనం చేస్తాడు

**మధుర:** తరువాత-?

**విశ్వ:** స్వార్థపరుల చేత యీ రీతిగా నాశనం చేయబడ్డ ధర్మాన్ని మరికొందరు స్వార్థపరులు అసలాధర్మం యొక్క మూల స్వరూపమే చెడ్డది అని చెప్పి, తమ స్వార్థానికి ఉపయోగపడే అధర్మాన్ని ధర్మంగా ప్రతిష్ఠిస్తారు

**మధుర:** ఇదంతా కావాలనే చేస్తారంటారా?

**విశ్వ:** నెహ్రూ గారి డెమాక్రసీ, సెక్యులరిజం; మైనారిటీకి మెజారిటీకే లేని హక్కులూ అట్లాటివే

**మధుర:** మీరెప్పుడూ ఇంగ్లీషు మందులు పుచ్చుకోలేదా?

**విశ్వ:** ఎన్నో కష్టసమయాలనూ ఆపద్దశలనూ పోతన గారి భాగవతం లోని షష్ఠస్కంధంలోని నారాయణ కవచం పారాయణతో పోగొట్టుకున్నాను.

**మధుర:** ఏవన్నా ఎక్సర్ సైజు చేసే వారా?

**విశ్వ:** వ్యాయామం, యోగాభ్యాసం; నిత్యం చేసే వాడ్ని. వ్యాయామం పెద్దయ్యాక మానేసినా, యోగాభ్యాసం తప్పనిసరిగా కొంసంటా వుండేది.

**మధుర:** కాఫీ పుచ్చుకుంటారా?

**విశ్వ:** కొంచెం పంచదార ఎక్కువ వెయ్యి.

**మధుర:** అన్నట్లు ముక్కామల నాగభూషణం గారు రష్యా వెళ్ళార్ట. అక్కడ మాస్కోలోని

తెలుగు అకాడమి అధ్యక్షురాలు వేయి పడగలని మెచ్చుకోవడమే కాకుండా కిన్నెరసాని పాటల్ని పుత్తడి బొమ్మ పూర్ణమ్మతో పోల్చి మాట్లాడిందట.

**విశ్వ:** ఇంకేముంది? యితగాడికి మతిపోయి వుండాలి.

**మధుర:** సాహిత్యేతరమైన ప్రిజుడిస్సులు యిలాగే వుంటాయి. స్వెల్లేనాకి అవేవీ వుండవు గదా! వేయి పడగలు ఫ్యూడల్ సిద్ధాంతాన్ని శ్లాఘించి ప్రగతిని నిరోధిస్తోందని ఆయన బాధ ఐ వుంటుంది

**విశ్వ:** ప్రగతినీ తిరోగతినీ సారస్వతం సాధిస్తుందనుకోవడం సమంజసం కాదు

**మధుర:** మీకు సంగీతం వచ్చా?

**విశ్వ:** నేను అన్ని రాగాలు పాడుతాను (నవ్వి) పేర్లు తెలియవు.

**మధుర:** నవలలు మీరు వ్రాయరట గదా

**విశ్వ:** నేను చెబితే మా వెంకటేశ్వరులు వ్రాశాడు వేయి పడగలు పూర్తిగా నెలరోజులు పట్టలా - వీరవల్లడు, జేబు దొంగలు, కడిమి చెట్టు, బద్దన్న సేనాని మా శిష్యుడు చతుర్వేదుల లక్ష్మీనరసింహం రాశాడు. ఇంకా ఎందరో రాశారు, నా నవలలు

**మధుర** : ఇన్ని రాశారు కాని మీ జీవితచరిత్ర వ్రాయలేదేమి?

**విశ్వ:** నా కవిత్వం అంతా నా జీవితంలోని అనుభవాల మయం లోకవ్యక్తిని కావ్యవ్యక్తినయ్యాను రామాయణంలో దశరథుణ్ని బంధుజ్యేష్ఠుడన్నాను వేయి పడగలలో రామేశ్వరశాస్త్రిని బంధుజ్యేష్ఠుడన్నాను ఎవరి గురించి? మా నాయనగారు శోభనాద్రి గురించి నీ చుట్టూ వున్న లోకంలో నీకు చెందని భాగం ఏం వుంటుంది?

**మధుర:** ఇందులో వెదుక్కోవాలి స్పష్టంగా రాయవచ్చు కదా.

**విశ్వ:** భలే దానివే! నీక్కూడా యీ పిచ్చి పట్టిందా? నా గ్రంథాలన్నీ చదివిన వాడికి నా జీవితమంతా తెలుస్తుంది ఇక నా పుట్టిన తేదీ, చచ్చిన తేదీ మధ్య తేదీలలో నేను బ్రతకలేక చచ్చినవీ, చావలేక బ్రతికినవీ అయిన ఘట్టాలే కదా చరిత్రగా వ్రాయాలంటే అలాంటిది వ్రాయటమంటే నాకు తలకాయనొప్పి

**మధుర:** ఎంతో కొంత రాశారట గదా

**విశ్వ:** నేను అనే వాణ్ణి ఈ శరీరం కాదు గదా! ఆ నమ్మకం నాకు గట్టిగా వుంది ఆ 'నేను' అనే వాణ్ణి నా పుస్తకాల నిండా నింపా నా శరీరం తీసికెళ్ళి కృష్ణ ఒడ్డున తగలేస్తారు నా పుస్తకాలను తగలేస్తే ఆ 'నేను' అనే వాణ్ని కూడా తగలేసినట్లవుతుంది నేను తగలేస్తే తగల బడేవాణ్ణి కాను పాతి పెట్టితే పాతి పెట్టబడే వాణ్ణి కాను.

**మధుర:** అబ్బ! ఎంత మృదువుగా వుంది మీ ధోరణి!

**విశ్వ** : అది అంతే. ఎవరైనా ప్రసాదంగా కొబ్బరి చిప్పపెడితే వెంటనే నోట్లో వేసుకునే వాడిని కాదు.

**విశ్వనాథ పద్యం**

**మధుర:** ఏం చేసే వారు?

**విశ్వ:** ఏదో కొట్లో కాస్త ఉప్పుగల్లు తీసుకునే వాడ్ని. కూరల మార్కెట్టుకి పోయే దాకా ఆ ఉప్పుగల్లూ కొబ్బరిముక్కా చేతిలో వుండేవి పచ్చిమిరపకాయలు కనపడగానే యీ కొబ్బరి ముక్కకూ ఉప్పుగల్లుకీ రుచులు కల్పించే వాడిని నోట్లో

**మధుర:** బాగానే వుంది సరసం.

**విశ్వ :** సరసం కాదు అదే క్షణాలలో భగవద్విషయికమైన రామాయణ భావనతో ఒక యిరవై ముప్పై పద్యాలు మనసులో అల్లుకునే వాడ్ని

**మధుర:** ఆశ్చర్యం! ఇరవై ముప్పై పద్యాలే

విశ్వనాథ ఇంటికి రాగానే వాటిని కాగితం మీద పెట్టే వాడ్ని

**మధుర:** అందుకే మిమ్మల్ని 'తెలుగువాళ్ళ గోల్డు నిబ్బు, కొండవీటి పొగమబ్బు' అని అన్నాడు శ్రీశ్రీ

**విశ్వ:** నీకు వాడు ఫ్రండా?

**మధుర:** మీలాగే-

**విశ్వ:** ఇంకా ఏవన్నా డేం?

**మధుర:** నాకు కులం అనీ, మతం అనీ పట్టింపు లేవీ లేకపోయినా ఈనాడు మరో కవి కుల గురువు మాయమయినాడని వాపోతున్నాను.

'మాటలాడే వెన్నెముక
పాటపాడే సుషుమ్న
నిన్నటి నన్నయభట్టు
ఈనాటి కవిసామ్రాట్టు
గోదావరి కవిసామ్రాట్టు
గోదావరి పలుకరింత
కృష్ణానది పులకరింత
కొండవీటి పొగమబ్బు!' అన్నాడు శ్రీశ్రీ

**విశ్వ:** నయం! ఇంకా నేను వాడికంటె తర్వాత పోయుంటే చచ్చేవాడ్ని.

* * *

సత్యనారాయణగారు లీలామహల్‌కు వెళ్ళి 'టెన్ కమాండ్ మెంట్సు' ఇంగ్లీషు సినిమా చూసివస్తున్నారు దారిలో విజయ టాకీస్ వద్ద ఒక మేదర స్త్రీ నులక మంచాలు అమ్ముతోంది. సత్యనారాయణగారు ఆగి రిక్షాదిగి 'ఎంత' అని ఆ మంచం బేరం చేశారు. ధర చెప్పింది. 'ఆగుతుందా' అని మళ్ళీ అడి గారు. ఆ వనిత 'చూసుకోండి అంది'. 'ఎందరెక్కినా ఆగుతుందా' అని అడిగారు. తల వూపింది. 'నువ్వూ నేనూ ఎక్కితే

ఆగుతుందా' అని మళ్ళీ అడిగారు. ఆ మేదర వనితకి కవిసమ్రాట్ తెలియదు. ఏవో సహజమైన బండబూతులు తిట్టింది. సత్యనారాయణగారు నవ్వుకుంటూ రిషా ఎక్కి పోనియ్ అన్నారు

**మధుర:** ఇదేమి అలవాటు? అదేవిటి సిగరెట్ కాలుస్తున్నారు కవి సమ్-రాట్.

**విశ్వ:** రోజూ ఏదో ఒక చిలిపి పనిచేసి ఎవరిచేతనైనా చివాట్లు తినకపోతే నాకు నిద్రపట్టదు ఇంగ్లీషు సినిమాలు చూడటానికి వెళ్ళినప్పుడు రాములు కోట్లో రెండు మూడు కారా కిళ్ళీలు, అప్పుడప్పుడు సరదాకి సిగరెట్ వూదాల్సిందే?

**మధుర:** గిరీశం చుట్ట కాలిస్తే మీరు సిగరెట్ అన్నట్లు మీరెప్పుడైనా కన్యాశుల్కంలో వేషం వేశారా?

**విశ్వ:** ఒకప్పుడు 1932 - 36లలో విశ్వనాథ సత్యనారాయణ అనే నిరుద్యోగి వుండేవాడు. గుంటూరులోనూ విజయవాడ లోనూ దొరకినపుడు ఉద్యోగాలు చేస్తూ వుండే వాడిని ఆ రోజుల్లో రామప్పంతులు వేసే వాడ్ని.

**మధుర:** మీనాక్షి ఎవరు?

**విశ్వ:** ఎర్రోజు మాధవాచార్యులు

**మధుర:** మా గురువుగారు గురుజాడ గురించి మీ అభిప్రాయం?

**విశ్వ:** Gurujada was a genius He Produced a very great drama that caught the imagination of the English educated youth of his times and it came to Stay.

**మధుర:** మీ కంటె గిరీశంగారు బెటర్ ఆయన ఇంగ్లీషు మాట్లాడుతూంటే దొరలు మాట్లాడుతున్నట్లుంటుంది ఇంతకీ ఏవంటారు?

**విశ్వ:** కన్యాశుల్కం నాటకం కాదని నాటకమంటే తెలిసిన వాడు ఎవడైనా అంటాడు

**మధుర:** చిత్రం మహా విచిత్రం అన్నట్లు వుంటాయి మీ మాటలు కన్యాశుల్కంలో వేషం వేశారు కన్యాశుల్కం నాటకం కాదంటున్నారు మళ్ళీ

**విశ్వ:** కాని, యీ కాలానికి అప్పారావు పంతులు గారు వ్రాసిన కన్యాశుల్కం పనికి వస్తున్నది నిజానికి పనికిరావడం లేదు కూడాను ఎందుచేతనంటే ఆ పుస్తకంలో విమర్శింపబడ్డ సాంఘిక పరిస్థితులు ఇవాళ కొత్తగా లేవు బాగా పాతబడి పోయినవి

**మధుర:** గురజాడ మహాకవి కాదంటారు?

**విశ్వ:** అదోటా? కవే కాదంటూ వుంటే. ఆయనకు ఉన్న శక్తి హాస్యరసం రెండవది బ్రాహ్మణ సంఘంలో ఉన్న ఎందుకూ పనికిరాని వాళ్ళ గురించి వెక్కిరించటం

**మధుర:** Sri Gurajada Appa Rao heralded a new era in Telugu Literature. The era of Colloquialism అన్నారు ఒకప్పుడు. ఇంగ్లీషులో ఒకలా తెలుగులో ఒకలా ఉన్నాయేవిటి మీ అభిప్రాయాలు?

**విశ్వ:** నన్ను నెఱుగరో యీ తెల్గునాట మీరు
విశ్వనాథ కులాంబోధి విధుని, బహువి
చిత్ర చిత్ర ధ్వని బహు విచ్చిత్తి మన్మ
హా కృతి ప్రణేత సత్యనారాయణ కవి

**మధుర:** మీరు వేయిపడగలు తెలుగులో వ్రాసి వుంటే బాగుండేది?

**విశ్వ:** అంటే ?

**మధుర :** వ్యవహారిక భాషలో వ్రాయకుండా మీ కోసం మీరు పెంకెతనానికి సృష్టించుకున్న శైలిలో వ్రాశారేమి?

**విశ్వ:** ఇప్పుడు నాగ్రాంధిక శైలితో నీకేమి పేచీ వచ్చింది? ఆ రోజులలో ఆంధ్రదేశంలో పురుషుల కంటె స్త్రీలు ఎక్కువ చదివేవాగు వేయిపడగలు అది తెలుసా?

**మధుర:** మీరు చెప్పిన చక్కని భావాలు కూడా మీరు ఉపయోగించిన భాష పాతదనం వలన మంచివి కూడా పనికి రానివనుకున్నారు జనం

**విశ్వ:** ఇదేదో పులిమీద పుట్రలా కొత్తగా వింటున్నాను చెప్పు

**మధుర:** వృక్షసంపదను నేలకూల్చితే ప్లవాలు పడవనే విషయాన్ని పృషన్నిధి-ఆదివటముల కథ ద్వారా చెప్పారు ఇప్పుడు వాతావరణ సమతుల్యం, చెట్లు నాటండి అంటూ వన మహోత్సవాలు జరుపుతున్నారు ప్రభుత్వాలు ఈ మంచి విషయం యాభై ఏళ్ళ క్రితమే మీరు చెప్పారు ప్రజల భాషలో చెప్పక పోవడం వలన-

**విశ్వ:** చెప్పక పోవడం వలన-

**మధుర:** విశ్వనాధ చాదస్త కల్పనగా కొట్టివేశారు శ్రీశ్రీగారు మీరు వ్రాసిన గొడ్డు తెలుగులో రాస్తే విప్లవ కవిత్వం ఎవరూ చదివేవారు కాదు మీరు సనాతనవాదులు కనుక అంతా ప్రగతికి వ్యతిరేకం అని తిరస్కరించి వుండవచ్చు

**విశ్వ:** వినాశనానికి కారణాలయ్యే ఆధునిక మార్పులను విమర్శిస్తే అసలు ఆధునికతనే విమర్శించాననుకున్నారు నా శత్రువులు

**మధుర:** మీకు వచ్చిన కీర్తి అంతా మీ శత్రువుల వల్లే వచ్చింది పాత కొత్తల మేలుకలయిక కాలేకపోయారు మీరు

**విశ్వ:** సనాతన విలువలు ఆధారంగా జాతినిర్మాణం జరగాలి అన్నాను అది భారతీయ పునరుజ్జీవన వాణి గనుక

**మధుర:** జమీందారీ వ్యవస్థ సనాతన మెలాగయింది గణాచారి పునరుద్ధరింపబడాలా?

**విశ్వ:** అది సాంకేతికము నీకెట్టుల తెలియును?

**మధుర:** సాంకేతికం కాదు, వల్లకాడు కాదు ఈ గణాచరులు రేణుకళు చేతబడులతో

తెలంగాణా అంతా అధ్వాన్నమయిపోయింది. మూఢవిశ్వాసాలు ప్రబలిపోయి ప్రజలు హిస్టీరియా లోపడి కొట్టు కొంటున్నారు. అదంతా బలవంతపు వ్యభిచారంగా మారింది.

**విశ్వ:** ఆచరణలో అన్నీ భ్రష్టమవుతాయి. దానకి నేనా బాధ్యుడ్ని.

**మధుర:** నాటి మంచికి వస్తున్న మార్పులకి సమన్వయం చేయలేక పోయారు మీరు. మార్పులని వ్యతిరేకించటమే దేశభక్తిగా పెట్టుకొన్నారు చాదస్తంగా

**విశ్వ:** సమన్వయం మనల్ని అడగకుండానే జరుగుతుంది దానమ్మ కడుపు కాల చెట్టూ చేమా యిదంతా మహా చైతన్య స్వరూపం ఇది వైదిక భావన ఆంగ్లేయులతో పోరాటం సాంస్కృతిక రంగంలో ప్రారంభించింది నేను అందుచేత ప్రతి మార్పు అవశ్యం వ్యతిరేకించాల్సింది గానే వుంది.

**మధుర:** మీరు ఆనంద గజపతి కాలంలో వుండి వుండవలసింది ఆ మహారాజు కొలువులో వుంటే-

**విశ్వ:** వుంటే - అది ఆంగిలేయుల ధర్మరాజ్యము అన్నాడుగా మీ గురుజాడ. నేనింగ్లీషు వాళ్ళని వ్యతిరేకించాను. అతను వాళ్ళని సమర్థించాడు మీ రాజుగారి కొలువులో నేనెందుకుండాలి?

**మధుర:** ఎందుకంటే మా గురువు గారిని అప్పుడు వాళ్ళు కూడా కవిగా గుర్తించలేదు కనుక మిమ్మల్నయితే స్పష్టంగా గుర్తించ కలిగే వారు మా మహారాజు గారంటే మాక్సు ముల్లర్ ఋగ్వేదం ప్రచురణకు ఆ రోజుల్లో లక్ష రూపాయలిచ్చిన మహాదాత

**విశ్వ:** మాక్సుముల్లర్ గుర్తించబట్టి మన వేదాల పౌరుష్యం అంగీకరించబడుతోందన్న మాట దీన్ని నేను వ్యతిరేకించాను హెర్బర్ట్ రీడ్ 'నోదైసెల్ఫ్' అన్నాడంటే ఆహ్హో అతి ప్రాచీన సూత్రం చెప్పాడన్నారు మన భగవాన్ రమణమహర్షి 'నిన్ను నీవు తెలుసుకో' అన్నాడంటే ఎవ్వరికీ పట్టలేదు అదీ మన దురవస్థ.

**మధుర** : వేణుగోపాలస్వామి గిరికకి ఆముదం దీపము చాలు విద్యుద్దీపం బయటి వెలుగుకి ఆధునిక సంకేతం మానవుడు ప్రాచీనమైన వెలుగును కోల్పోయి విద్యుత్తే వెలుగనుకుని పిచ్చివాడైనాడు అని రాశారు ఏవిటీ అసందర్భపు రాతలు?

**విశ్వ:** అదంతా సాంకేతికమైన గొడవ నీకెందుకు చెప్పు? నీ కళ్ళకు పరమఛాందస బ్రాహ్మణ ముండాకొడుకులా కనిపిస్తే కనిపించవచ్చు కాని బ్రాహ్మీమయ మూర్తిని నన్నయ్య తరువాత నా అంతవాడు పుట్టలేదు మళ్లీ నా అంతవాడు యీ గడ్డమీద జన్మించడానికి ఎంతకాలం పడుతుందో?

**మధుర:** ఏమీ అహంకారం?

**విశ్వ:** నీకు తెలియదు పిల్లా! అహంకారం లేకపోతే అణచివేస్తారు పాతాళానికి. భారతదేశ నాగరికత గ్రీసు దేశ నాగరికతకు అనుకరణ అనే వాదం ఇంగ్లీషు వాళ్ళు తెలివిగా లేవదీశారు. ఇది చాలా అసత్యవాదం గ్రీసు నాగరికతలో భారతీయ నాగరికత ప్రభావం వుంది.

మనుస్మృతి ప్రభావం ఈజిప్ట్, క్రెటి, సుమేరియా, ఇరాన్, బాబిలోన్, రోమ్ మొదలైన అన్ని దేశాలమీద వుంది. ఇవన్నీ నేను వేయిపడగలు రాయడానికి ఆవిర్భావ హేతువులు,

**మధుర:** మీకూ రంగనాయకమ్మకూ ఏవిటి గొడవ?

**విశ్వ:** ఆవిడకు తగని బ్రాహ్మణ ద్వేషం. రామాయణ విషవృక్షమని రాసింది. కమ్యూనిస్ట్‌లంతా తెగపొగిడారెమెను. శ్రీశ్రీ కొడవటి గంటి కుటుంబరావులు ఎత్తేశారామెను రామాయణం యిలా కాదు యిలా జరిగింది అని ఆమె పరపరా పుస్తకాలు రాసేసింది. తగిలించి తమాషా చూసే వాళ్ళెప్పుడూ వుంటారు కదా!

**మధుర:** మీరామెకు సమాధానం రాశారా?

**విశ్వ:** సమాధానం కాదు గాని ఓ నవల రాశాను జయశ్రీ అనే మాసపత్రికలో అదే నా ఆఖరి నవల అచ్చు కాలేదు

**మధుర:** మీకూ కుటుంబరావుగారికీ పడదా?

**విశ్వ:** అబ్బే, అలాంటి దేమీ లేదు నేను చందమామకు అభిమాన పాఠకుడ్ని రాగానే కొని చదవకపోతే నాకు నిద్ర పట్టేదికాదు నేను నానా చెత్త చదువుతాను అద్దెకు తెచ్చి ఎన్ని యింగ్లీషు నవల్లు చదివే వాడినో.

**మధుర:** బెజవాడ కాలేజీలో పనిచేసినపుడు మీ జీతం ఎంత?

**విశ్వ:** ఎంతా? నూట యాభై ఆ రోజుల్లో అంతే శాలరీ. మా యింట్లో ఏడాదికి పదిహేను తద్దినాలు వచ్చేవి సుమారుగా ప్రతి తద్దినం పెట్టాల్సిందే విధాయకంగా తద్దినానికి పదిహేను రూపాయలయేది అయినా రోజులు వెళ్ళిపోయాయి

**మధుర:** అడివి బాపిరాజు గారు మీకు తెలుసా?

**విశ్వ:** తెలుసా? వాడు మా బాపి బావ కిన్నెరసానికి బొమ్మలు వేసింది వాడే వీధిలో కనపడ్డ వాళ్ళందరినీ భోజనానికి పిలిచే వాడు దర్జాగా. ఇంట్లో చెప్పేవాడు కాదు అతిథుల్ని తీసుకుని భోజనానికి తయారయే వాడు అప్పుడుండేది వాడి పెళ్ళాం అవస్థ ఇంట్లో చెప్పకుండా మమ్మల్నిందర్నీ ఓ యిరవై మందిని పిల్చేశాడు ఓసారి అప్పుడు అన్నగారూ అంటూ నన్ను పిల్చి ఆవిడ యిబ్బంది చెప్పుకుంది నేను చూస్తాలే నువ్వు కానియ్ అన్నా.

**మధుర:** ఏం చేశారు?

**విశ్వ** : నా రామాయణ కల్పవృక్షంలో కైకేయి వృత్తాంతం చదువుతూ వ్యాఖ్యానిస్తూ సర్వం మరిపించా

**మధుర:** ఇంతలో ఆవిడ వంటా పూర్తయి వుంటుంది. రామాయణం మీరు ఒకందుకు రాస్తే అది మరొకందుకు పనికివచ్చింది. అవునూ, మిమ్మల్ని కవిసామ్రాట్ అని ఎవరన్నారు మొట్ట మొదట?

**విశ్వ:** శ్రీ భావరాజు నరసింహారావు గారి ఆధ్వర్యంలో బందరు సారస్వత మండలి వారు.

మా గురువు గారు నా గురించేమన్నారో నీకు తెలుసా? విను.

నా మార్గంబును గాదు వీనిదరయన్ నాతాత ముత్తాతలం
దేమార్గంబును గాదు మార్గమెదియో యింకొక్కడట్లౌటచే
సామాన్యుండనరాదు వీని; కవితా సమ్రాట్ప్వ మా హేతువై
యీ మచ్ఛిష్యుని దావరించినది నేనెంతే ముదంబందగన్

**మధుర:** జాషువా గార్ని గూర్చి మీరేమంటారు?

**విశ్వ:** ఏమంటాను. జాషువా వలె తెలుగు నుడికారంతో రచన చేయటం నాకు కూడా సాధ్యం కాదు. నిజమే

**మధుర:** శ్రీశ్రీ గురించి ఏవంటారు?

**విశ్వ:** ఈనాడు మహాకవి అని చెప్పదగిన వాడు యీయనే వీడమ్మ కడుపు మాడ ఏమీరాశాడు 'కవితా ఓ కవితా' అంటూ. వాడి కమ్యూనిజం నాకు గిట్టదనుకో

(ఇంతలో ఎవరో వచ్చి తిరపతి ప్రసాదం అని లడ్డూ చేతిలో బెట్టి పోతారు నమస్కరించి)

**మధుర:** నాకు పెట్టకుండా అంతా మీరే తినేస్తున్నారే?

**విశ్వ:** తినేశానే - ఏం చెయ్యను. వీడమ్మకడుపు మాడ వీడు వూరంతా అప్పులు చేస్తాడు. నా దగ్గర కూడా - వుంటే లేదనను. ఏడాదికి రెండు మూడు సార్లు తిరుపతి పోయొస్తాడు అక్కడే ముంది? వీడి బొంద-వూళ్ళో అందర్నీ వీడు గొరుగుతాడు . వీడ్ని తిరపతిలో వాడు గొరుగుతాడు.

**మధుర:** మీకు తిరుపతి వేంకటేశ్వరస్వామి అంటే పడదా?

**విశ్వ:** చంపావ్ ఫో అస్తమానం బుడుంగు బడుంగున అప్పులు చేసి తిరుపతి పోవడం. అక్కడ బోల్డు కర్చు. ఇదో పిచ్చి వెర్రీను అప్పులు చేసి వూళ్ళో వాళ్ళని ముంచి తిరుపతి వెళ్లకపోతే నేం? వుండు ( వెళ్ళి వాళ్ళని అడిగి మరో లడ్డుతెచ్చి మధురవాణి కిస్తాడు) తిను నాకు మొదట్నుంచీ తీపి సరుకు యిష్టం లేదు కారపు వస్తువులంటే పడిచస్తా - నా జీవితంలో ట్రాజిడీ ఏవిటో తెలుసా?

**మధుర:** చెప్పండి

**విశ్వ:** బందరులో రెండు తినుబండారములు కలవు ఆంధ్రదేశములో మహాప్రసిద్ధి పొందినవి. ఒకటి బందరు తొక్కుడు లడ్డు. దీనిని ఢిల్లీలో లక్నోలో రావల్పిండిలో నున్న యాంధ్రులు కూడా తెప్పించుకు తిందురు దీని నెరిగిన వారు అమెరికా కాని, లండను కాని వెళ్ళినచో కొని తీసికొని పోదురు. అయినను దానిమీద నాకంత యిష్టము లేదు. నాకు కారపు వస్తువుల మీద నిష్టము. ఆ రెండవ వస్తువు కారపు వస్తువు. అందులో కారముండదు. కారమును నంజుకొని తినవలయును. దాని పేరు పునుకులు. పెసరపునుకులు వాని రుచి చెప్పుటకు వీలులేదు అందులో పచ్చిమిరపకాయల కారము నంజుకొని తిన్నచో స్వర్గానికి బెత్తెడెడము కాదు స్వర్గానికి పైన బెత్తెడు.

**మధుర:** చెప్పకండి-నే నాగలేను.

**విశ్వ:** పొద్దుటి పూట యివి తినని వాడు బందరులో అణాకు గతిలేని వాడు. అణా చెల్లగా అణా నీవు పావలా పునుకులు తిన్నచో కనీసము వారము దినములు నీకాకలి కాదు పునుకులు తినుట ఆకలి కొరకు కాదు వట్టి రుచి కొరకు.

**మధుర:** ఇప్పుడు వెళ్దామా?

**విశ్వ:** ముట్నూరి కృష్ణారావుగారంతటి ఎడిటర్ చాటుగా వానిని తెప్పించుకొని తినుట నేనెరుగుదును నేను రెండేండ్లు అవి తిని నా ఆరోగ్యం పాడు చేసుకొన్నాను. ఇంతకీ ట్రాజిడీ ఏవిటంటే - నాదగ్గర డబ్బులు లేనప్పుడు నాకు చచ్చేటంత ఆకలి. దరిద్రుడికి ఆకలెక్కువ అన్నట్లు. ఇప్పుడు డబ్బులికి తడుము కోనక్కర్లేదంటే జీర్ణశక్తి లేదు. తినలేను అరాయించుకోలేను నాకు మొదట్నుంచీ అవీ యివీ చిరుతిళ్ళు తినడం మీద ధ్యాసెక్కువ. నాకున్నంత జిహ్వ చాపల్యం సృష్టిలో మరెవ్వరికీ వుండదేమో

**మధుర:** మీకు బందరులో పెసర పును లు ఎల్లాగో మాకు విశాఖపట్నం విజయనగరాల్లో పుల్లట్లు అల్లాగ పుల్లట్లు తినే రాశాస్త్రే 'రాజు - మహిషి' నవలా రచయిత

**విశ్వ:** ఆరు సారా కథలు వ్రాసి సాహిత్యమునకు సారా రుచి యంటించిన వాడా?

**మధుర:** అవును పులుసటుకులని మరొక భక్ష్య విశేషం వుంది. అది తింటేనే కన్యాశుల్కం రుచి తెలిసేది.

**విశ్వ:** అప్పారావుగారికి పులుసటుకు లిష్టమా?

**మధుర:** కాదు కాదు పులుసటుకులు వెంకటేశానికి. అప్పారావు పంతులుగారికి ద్రావిడుల యింట్లో కాల్చిన దిబ్బరొట్టె అంటే చాలా యిష్టం. చనిపోయే ముందు నారాయణదాసు గారింట్లో కాల్చిన దిబ్బరొట్టె తెప్పించుకుని తిన్నారు పంతులుగారు

**విశ్వ:** శ్రీశ్రీ కేమిష్టం?

**మధుర:** గరం గరం పొంగరాలు రంగ రంగ పొంగరాలు. మీరు కిళ్ళీలు బాగా నముల్తారా?

**విశ్వ:** నాకు రాగము సత్యనారాయణ అని ఒక స్నేహితుడుండే వాడు. అప్పుడు క్లాసుకి మానిటర్‌ని నేను, చిన్న క్లాసులనించీ కూడా. తాను బడికి రాకపోయినా హాజరు వేయించుకోవచ్చును నాకు లంచం పెట్టి. కాపులు అనుకుంటా వారు. ధనవంతులు. ఒక యేడా రెండేండ్లా? నాల్గైదేండ్ల లంచము.

**మధుర:** ఏవిటి?

**విశ్వ:** సత్యనారాయణ నాకు తమలపాకు కిళ్లీలు లంచం పెట్టేవాడు. తర్వాత నా భార్య నేను నాల్గవ పారం చదువుతుండగా కాపురానికి వచ్చింది. తమలపాకులు కొనేవాడ్ని. తాంబూలం వాజీకరణం కదా!

**మధుర:** చదువుకునే రోజులలో మీ వేషం ఎలా వుండేది?

**విశ్వ:** 'నీకు నవ్వు వస్తుంది. ఒక చొక్కా - చేతులకు మురుగులు - కాళ్లకు కడియాలు. నెత్తిమీది జుట్టు బండి గూడు కత్తిరింపు, జుట్టు ముడి వెనుక గిరజాలు, ముందు సన్నని గిరజాలు. ఇది నా వేసము.

**మధుర:** కొంచెం యించు మించుగా పాండురంగ మహాత్మ్యం లోని నిగమశర్మ లావుండే వారన్న మాట. (నవ్వు) మీకు చిన్నప్పుడు దయ్యాల భయం అదీ వుండేదా?

**విశ్వ:** భూతములు మాయూరిలో నుండెడివి. ప్రయోగములు చేసెడి వారు కలరు. మా యింటి వెనుక రావిచెట్టు కలదు. దానిమీద దయ్యము లుండెడివి. మా యింటి వెనుక నొక యిల్లున్నది. ఆ గృహస్థు ప్రయోగములు చేయుట యందు ప్రవీణుడని ప్రసిద్ధి. దానికి సాక్ష్యములున్నవి. నేను ప్రత్యక్షముగా చూచినవి. నాకనుభవములోనున్నవి.

**మధుర:** కన్యాశుల్కంలో మీరు రామప్పంతులు వేశారు కద. అసిరి గాడు పూజారి గవరయ్య అదంతా మీకనుభవమే. రామప్పంతులు కూ్కడా దయ్యాలంటే భయం.

**విశ్వ** : గిరీశం తరవాత నిన్ను చేరదీసింది ఎవరు? వాడే కదా! కన్యాశుల్కంలో నీకు ఎవరంటే ఎక్కువిష్టం?

**మధుర:** కరటకశాస్త్రి శిష్యుడు ఎందుకంటే గొంతు మార్చివాడు నన్నేమాయచేశాడు.

**విశ్వ** : నాకు నువ్వంటే యిష్టం. నిండు మనమ్ము నవ్య నవనీత సమానము-

**మధుర:** ఆగండాగండి. మీ చిన్న కథల్లో మీరు చాలా మంచి పూలమొక్కల్నినాటారు మీ రెక్కిన మెట్లు ఎవరూ అందుకోలేరు. ముఖ్యంగా మాక్సీ దుర్గంలో కుక్క, ఏమి సంబంధం, నీ ఋణం తీర్చుకున్నా చదివితే-

**విశ్వ:** చదివితే-

**మధుర:** అస్తమానూ వేయిపడగల్ని మాత్రమే పొగిడే వారు కళ్ళు తెరుచుకుంటారు మీ నవలలన్నీ ఒక ఎత్తూ వాటి మీద మీ కథలు మరో ఎత్తూను

**విశ్వ:** ఐయామ్ బెటర్ దేన్ గురజాడ-

**మధుర:** సృష్టిలో పరిచయాలు ఎందుకు కలుగుతాయి? అవి ఏవిధంగా పర్యవసిస్తాయి? చివరికి ఏమవుతుంది?

**విశ్వ:** తన జీవితంలో ఏమీ సంబంధం లేకపోయినా ఏ విధంగా తన మనసుతో ఆడుకొన్నదో చిత్రంగా వుంటుంది. సామాన్యంగా కొన్ని కథలు ' ఏమి సంబంధం' లాటివి ఎవరు పడితే వారు వ్రాయలేరు. జననాంతర సౌహృదాని అన్నాడు కాళిదాసు

**మధుర:** వేయి పడగలు చివరలో చాలా చిన్న పిల్లకు కథా నాయకుడితో పెళ్ళి జరిపించా రేమి? అదీ సాంకేతిక విషయమేనా?

**విశ్వ:** కొందరి బుద్ధిలో అది పెండ్లికానిచో, వయసు తారతమ్యము కింద గొప్ప చేయబడి వివాహమన్నచో తప్పుగా పరిగణింపబడుచున్నది ఇది యాధునికుల నాగరికతా సంపత్తి.

**మధుర:** గురువుగారూ బద్దన్న సేనానిలో మీరు పంచములకు లేని వర్ణప్రతిష్ఠను యిచ్చి

వాళ్ళకి బానిసత్వ వృత్తిని స్థాపించారంటున్నారు. అంటరాని తనాన్ని మహత్తర ఆదర్శంగా కీర్తించారంటున్నారు. పైగా ఆధునికులు చెప్పే ప్రేమ సిద్ధాంతాన్ని పంచమకుల సిద్ధాంతంగా వికృతీకరించారంటున్నారు. మీరేమంటారు?

**విశ్వ:** ఆనాటి వ్యవస్థని యిప్పటి కళ్ళజోళ్ళతో చూస్తే అలాగే కనిపిస్తుంది. ఆ కాలంలో అంటరానితనం వుంది. దాన్ని బద్దన్న విశ్వసించి పాటిస్తానంటే మధ్యనన్నెందుకు తిట్టడం? ఎవరికేది వెతుక్కుంటే వారికది కనిపిస్తుంది. 12వ శతాబ్దపు ఆంధ్ర ప్రాంత రాజకీయాలు నీకు తెలుసా?

**మధుర:** భారతీయ సంప్రదాయాన్నీ సంస్కృతినీ గాక మనుధర్మాన్ని మాత్రమే మీరు సమర్థించడానికి రచనలు చేశారని విరసం వారంటున్నారు?

**విశ్వ:** వారా? వారు తుపాకీ గొట్టంలోంచి మాత్రమే విప్లవం వస్తుందని నమ్మే చైనాభక్తులు మావో మా ఛైర్మన్ అని గంతులేసే వాళ్ళు వాళ్ళు దేశభక్తులే కారు భారతీయ సంస్కృతి వారికి మింగుడు పడదు పాకిస్తాన్‌తోను తమిళ టైగర్లతోనూ స్నేహం చేసి ఆయుధాలు తెచ్చుకునే వీళ్ళా ఏది సంప్రదాయమో ' ఏ భారతీయ సంస్కృతో కాదో చెప్పేది? వింటే ఎవరైనా నవ్వుతారు!

**మధుర:** మీవి ఫాసిస్టు భావాలంటున్నారు, దిగ్రేటు విరసం కవులు?

**విశ్వ:** పీరు సాయిబుకి గోకు లాష్టమి ఎప్పుడంటే అర్థం కానట్లు యీ విప్లవ కమ్యూనిస్టులకు ప్రాచీన భారతీయ సంస్కృతీ మనుధర్మం ఎట్లా అర్థమవుతాయి?

**మధుర:** వారు ఏ రకంగా చెప్పినా అవి కాలం చెల్లినవి, ఈ నాటికి వర్తించవు అనే మీరు ఫ్యూడల్ సాంఘిక సాంస్కృతిక శక్తుల్ని ఆదర్శీకరించి సంప్రదాయక కుటుంబాలనించి వచ్చిన అనేకమంది యువపండిత కవుల్ని తప్పుడు తోవకి మళ్ళించారంటున్నారు?

**విశ్వ:** పోనీ వాళ్ళని సరైన దారికి మళ్ళించమను నేను వద్దనలేదే? మన సంస్కృతి చాలా బలమైనది దాని పునాదులు ఎక్కడ వున్నాయి భారతీయ జీవనంలో? వాళ్ళంతా యిళ్ల దగ్గర ఫ్యూడల్ పద్ధతుల్నే అవలంబిస్తున్నారని రా.రా అన్నాయన కమ్యూనిస్టుల్ని వేళా కోళం చేశాడు అయినా ఆ తుపాకీ గొట్టం గాళ్ళతో మనకెందుకు పోనిస్తూ

**మధుర:** నయా ఫ్యూడల్ విమర్శకులు బయల్దేరి విశ్వనాథ సాహిత్యాన్ని మళ్ళీ పైకెత్తి విరసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారంటారు అది నిజమా?

**విశ్వ:** వాళ్ళను చూసి అంతా హడలిపోతున్నారని సాహిత్య నక్సలైట్లు అలా ప్రచారం చేసుకుంటూ వుంటారు పైగా రివిజనిజం మీద పోరాటం విస్మరించావంటున్నారు.

**మధుర:** మీరు బ్రాకెట్లాడే వారట గదా న్యూయార్క్ కాటన్, కర్లీ వీ కార్టూన్లు....

**విశ్వ:** అవును జూదం ఒక వ్యసనం. ఓపెనింగూ క్లోజింగూ ఆ చార్టు అంతే నా దగ్గరుండేది. నేనేవిటి కథక చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా ఆడేవాడు.

**మధుర:** మీకు విజయవాడలో శిలావిగ్రహం లేకపోవడం తోటే అనుకుంటాను.

**విశ్వ:** నాకు విగ్రహాలెందుకు నా పుస్తకాలున్నాయిగా అవి చదువుకుని మంచి చెడ్డలు తర్కించుకుంటారు. నా పుస్తకాలున్నన్నాళ్ళు నేనుంటాను

**మధుర:** తెలుగుభాష వున్నంత కాలం మీరుంటారు మీచేత తిట్టించుకోవడం ఓ సరదా విశ్వనాథ తర్కం అని మీతోబాటు మీ తర్కం కూడా చిరంజీవి

**విశ్వ:** ''నా కవితన్ విశాల జఘనా!
ఒక యాచితి లేదు భాషలే
దాకృతి లేద, యూరక రసాత్మతనే
స్రవియించి పోదు .. ''

★

(*'మిసిమి' సెప్టెంబర్, అక్టోబర్, 1991*)